ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 13 ఆగస్టు 2025



గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.50 (310.5510)	1,44,864	1,86,380
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.22 (4.0)	9,692	13,088
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.062	1,82,656	2,20,121

చికెన్ ధరలు: లైవ్ : రూ. 132 | డ్రెస్ : రూ.197 | స్కిన్‌లెస్ : రూ.221



తుంగతుర్తిలో అలుగుపోస్తున్న పల్లె చెరువు

జిల్లాలో ప్రధానమైన రెండు ఆయకట్టుల్లో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. గరిష్ఠ నీటిమట్టం ఉండగా ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండటంతో రైతుల్లో భవిష్యత్ సాగు నీటి వనరులపై భరోసా నెలకొంది. అదేసమయంలో రెండో అతిపెద్ద ఆయకట్టు కలిగిన శ్రీరాంసాగర్ రెండో దశ పరిధిలోని రైతులు నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సగం మేర మాత్రమే నీటినిల్వలు ఉండటంతో కాల్వలకు నీటిని విడుదల చేయలేదు. దీంతో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. బోరుబావుల కింద కొందరు సేద్యం ప్రారంభించినా ఆందోళనలో ఉన్నారు.



నీరు..కన్నీరు

- ప్రధాన ఆయకట్లలో భిన్న పరిస్థితులు
- సాగర్ ఎడమకాల్వ కింద ముమ్మరంగా సాగు
- ఎస్సారెస్పీ కింద నీటి కోసం ఎదురుచూపులు

అలుగులు, నీటి గలగలలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. దీంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధానంగా సాగర్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతుండటం, గరిష్ఠ నీటినిల్వలు ఉండటంతో 18 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా గరిష్ఠ నీటిమట్టం 590 కాగా ప్రస్తుతం 589.50 అడుగుల వద్ద నీటి నిల్వ కొనసాగుతోంది. అదేవిధంగా రెండు రోజులుగా హైదరాబాద్‌లో భారీ వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు వరద భారీగా వస్తోంది. దీంతో నాలుగు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 645 అడుగులు గరిష్ఠ నీటిమట్టానికి ప్రస్తుతం 643.22 అడుగుల నీరు ఉంది. అదేవిధంగా పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులకు ప్రస్తుతం 173.062 నిల్వ ఉంది. ఏడు గేట్లను ఎత్తి నీటి విడుదల చేస్తున్నారు.

ఇదిలా ఉండగా జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. సోమవారం రాత్రి 2గంటలకు పైగా భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వరి నాట్లు వేగవంతమవుతాయి. భూమి పూర్తిగా తడిసి పోవడంతో అన్ని రకాల పంటల సాగుకు సిద్ధమయ్యారు.

- వివరాలు 7,8వ పేజీల్లో



ఆత్మకూరు(ఎస్) మండలంలోని ఏపూరు వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

వానొస్తే సెలవే..

పాఠశాల ఆవరణంతా మోకాలు లోతు నీళ్లు

అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు వర్షాకాలం కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. నీటికుంటలో పాఠశాలను నిర్మించడంతో భారీవర్షం కురిసిందంటే పాఠశాల ఆవరణ మొత్తం నీటితో నిండిపోతోంది. మోకాళ్ల లోతు నీటిలో పాఠశాలకు చేరుకునేందుకు విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో పాఠశాలకు భారీ వర్షం వస్తే సెలవు ఇవ్వాల్సి వస్తోంది. ఈ నెల 5, 6 తేదీల్లో కురిసిన వర్షాలకు సెలవులు ప్రకటించగా, సోమవారం తిరిగి ప్రారంభమైన పాఠశాలకు రాత్రి కురిసిన వర్షానికి మరోసారి సెలవులు ప్రకటించారు. రెవెన్యూ, పోలీసులు ఏర్పాటుచేసిన ట్రాక్టర్లలో విద్యార్థినులను పాఠశాల బయటకు తీసుకురాగా తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. కొందరు మోకాలు లోతు నీళ్లలో తమ పిల్లలను భుజలాపై మోస్తూ బయటకు తీసుకెళ్లారు.

(ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

- మిగతా 6వ పేజీలో...



మోకాలు లోతు నీటిలో విద్యార్థులు, తల్లిదండ్రులు

కాల్వ నీటి కోసం ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా వానాకాలం పంట కోసం ఆగస్టు మొదటి వారంలోనే నీటిని విడుదలచేసేవారు. ఈసారి రెండో వారం పూర్తి సమీపిస్తున్నా నీటి జాడ లేదు. ప్రధానంగా ప్రాజెక్టులోనే సగం నీరు మాత్రమే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 90 టీఎంసీలకు 45 టీఎంసీలు మాత్రమే ఉండటంతో సాగు గండం గట్టెక్కేదెలా అ ని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ నుంచి వరద ప్రవాహం ప్రాజెక్టుకు కొసాగుతుండటంతో వారబందీ పద్ధతిలో నీరు వస్తుందన్న ఆశతో ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

శ్రీరాంసాగర్ రెండో దశ(ఎస్సారెస్పీ) ఆయకట్టు కింద ఉన్న రైతులు గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నారు. వారబంధీ పద్ధతిలోనైనా నీరు విడుదలయ్యేనా అని గంపెడు ఆశతో ఉన్నారు. ఎస్సారెస్పీ రెండో దశ పరిధిలో 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలు,ఉపకాల్వలు ఉన్నాయి. వీటి ద్వారా 2.44 లక్షలు ఎకరాలకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో వీటికి రూపకల్పన చేశారు. జనగాం జిల్లా కొడకండ్ల వద్ద ఉన్న బయ్యన్నవాగు నుంచి ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలోనే కాల్వలకు వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేసేవారు. జిల్లాలోని తిరుమలగిరి మండలం వెలిశాల సమీపంలో 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలకు నీరు ప్రవహిస్తుంటుంది. దీంతో సూర్యాపేట, తుంగ

తడిసేనా మడి..

- ఎస్సారెస్పీ ప్రాజెక్టులో ప్రస్తుతం సగం నీరే
- వారబందీ పద్ధతిలో విడుదల చేస్తారని ఆశ

తుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల్లోని 14 మండలాల పరిధిలోని 203 గ్రామాల్లోని 350 చెరువులు, కుంటలకు ప్రతి ఏటా యాసంగి, వానాకాలం సీజన్‌లకు నీటిని విడుదల చేసేవారు. ఐదేళ్ల నుంచి వారబందీలో 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ కురిసిన వర్షాలతో వరద ప్రవాహం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లో 90 టీఎంసీలకు 45 టీఎంసీల నీరు ఉంది. నీరు పెరిగితే విడుదల చేస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బోరు, బావుల కింద సాగు

గోదావరి జలాలు విడుదల చేస్తారనే నమ్మకంతో బోరు, బావుల కింద వరి నాడుమడులు పెంచుతున్నారు. బోరు, బావుల కింద 30 వేల ఎకరాల భూమిలో కొంతమంది రైతులు వరి నాట్లు వేశారు. వారబందీలో నీరు విడుదలైతే వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. కొద్దిపాటి వర్షాలు కురుస్తుండడంతో రైతులు భూములు దున్నుకొని నాట్లు వేయడానికి సిద్ధం చేస్తున్నారు.

వారబందీలో నీటిని విడుదల చేయాలి



రెండోదశ ఆయకట్టుకు వారబందీలో నీటిని విడుదల చేయాలి. ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలోనే అధికారులు నీటిని విడుదల చేసేవారు. ఈ ఏడాది గోదావరి జలాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం వచ్చింది. కొద్ది పాటి వర్షాలకు కొంత మేర సేద్యం చేసుకున్నాం.

- శ్రీనివాస్, రైతు అర్వపల్లి గ్రామం

ప్రాజెక్ట్ నిండితే నీటివిడుదలకు అవకాశం

శ్రీరాంసాగర్ నిండితే నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి 40 టీ ఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నిండితే నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. నీటి విడుదల కోసం పైఅధికారులకు నివేదికలు పంపాం.

- సత్యనారాయణ, ఎస్సారెస్పీ ఈఈ

బహుళజాతి కంపెనీలు వైదొలగాలి




ట్రంప్, మోదీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భారతదేశం నుంచి బహుళ జాతి కంపెనీలు వైదొలగాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. భారతదేశంలోని విదేశీ బహుళజాతి కంపెనీలైన అమెజాన్, వాల్‌మాట్, వోలా, ఉబర్, వంటి సంస్థలు అన్నిరకాల వస్తువులను విక్రయిస్తూ భారతదేశాన్ని దోచుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. భారతదేశ ఎగుమతి వస్తువులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ నిర్ణయించడం మన దేశ పరస్పర వాణిజ్య ఒప్పందాలను తిరస్కరించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి రవి, దూదిపాళ ప్రవీణ్, మహేష్, నవీన్, వినయ్, ఉపేందర్, సంధ్య, పావని, రమ్య, నవ్య, అఖిల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సహజ ప్రసవాలు కొనసాగించాలి

డీఎంహెచ్‌వో



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సహజ ప్రసవాలు కొనసాగించాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు జరగకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకు న్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిసరాలు, వాక్సినేషన్ స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఫీవర్ సర్వే, డెంగీ పాజిటివ్ కేసుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మౌనిక, అధికారులు యాదగిరి, భూతరాజు సైదులు, మాణిక్యమ్మ, జానమ్మ, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

బస్సు చార్జీలు తగ్గించాలి

నేరేడుచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బస్‌చార్జీలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులతో కలిసి మంగళవారం ఆర్టీసీ బస్సు ఎదుట నిరసన తెలిపారు. నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడకు 15 కిలో మీటర్ల దూరానికి పల్లె వెలుగు బస్సుకు రూ.50, ఎక్స్‌ప్రెస్‌కు రూ.60, డీలక్స్‌కు రూ.70, లగ్జరీబస్సుకు రూ.95లు వసూలు చేస్తున్నారన్నారు. నేరేడుచర్ల నుంచి కోదాడకు 35 కిలో మీటర్ల దూరం ఉంటే పల్లె వెలుగుకు రూ.40 వసూలు చేస్తున్నారన్నారు. కోదాడకు తక్కువగా, మిర్యాలగూడకు ఎక్కువగా డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపోలు నవీన్, కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను, యారవ సురేష్, కొమ్రరాజు వెంకట్, ఊదర వెంకన్న, శ్రీనివాసు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

72 గంటలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, అధికారులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు రానున్న 72గంటలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలన్నారు. సమాచారం కోసం అన్ని జిల్లాకేంద్రాల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ఉన్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అన్ని కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి 24గంటలు పనిచేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినా, ట్రాన్స్‌ఫార్మర్‌లు, లైన్‌లు పనిచేయకపోయిన పునరుద్ధరించాలన్నారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. అవసరమైతే పాఠశాలలకు, కళాశాలలకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించేలా విద్యాశాఖ నిర్ణయం తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి : కలెక్టర్

తిరుమలగిరి రూరల్: వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం రాత్రి మండలంలోని తొండ గ్రామంలో 180 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో కలెక్టర్ మంగళవారం గ్రామంలోని లోతట్టు ప్రాంతమైన 12వ వార్డులో పర్యటించారు. వలిగొండ- తొర్రూర్ జాతీయ రహదారి(193) తొండ గ్రామం వద్ద కమ్మంకుంట చెరువులోనికి వరద నీరు వెళ్లేందుకు కడుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. వరద నీరు చెరువులోకి వెళ్లేలా త్వరగా అడ్డంకులను తొలగించాలన్నారు. వరద ప్రభావానికి గురైన ఎల్లంల సోమయ్య, వేల్పుగొండ యాదమ్మ, పోతరాజు వెంకన్న, బండ్ల సురేందర్ ఇళ్ల వద్దకు వెళ్లి తడిసిన సామగ్రిని పరిశీలించారు. మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఏర్పాటు చేస్తామని, ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని, అవసరానికి నీటిని సరఫరా చేస్తామని ప్రజలకు ధైర్యాన్ని చెప్పారు. మిషన్ భగీరథ పైపులు పరిశుభ్రం చేసి, పరీక్షించిన తర్వాతనే ప్రజలకు తాగు నీరు అందించాలని అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా త్రాగు నీరు సరఫరా చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో లాజర్, డిప్యూటీ తహసీల్దార్ జానీమహ్మద్, ఎంపీవో భీంసింగ్, పంచా యతీ కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, ఆర్ఐలు సుజిత్, జార్జిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అర్వపల్లి: కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. అర్వపల్లిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రవహిస్తున్న నీటిని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సూచనలు చేయాలన్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి నీటి పారుదల శాఖ అధికారులతో నీటిని ఎటు వైపు మళ్లించాలని, నాలాలను పరిశీలించి నివేదిక తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, డీపీవో యాదగిరి, ఎంపీడీవో గోపి, ఇరిగేషన్‌ఏఈ హరిస్వరూప్, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణానికి మోక్షం

- భూసేకరణకు రైతుల మద్దతు
- రైతులతో రెవెన్యూ అధికారుల భేటీ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు, పాల్గొన్న రైతులు

హుజూర్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మగ్దుమ్‌నగర్ ప్రాంతంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేయనున్న వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణానికి మోక్షం లభించనుంది. హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని 1041 సర్వే నెంబర్‌లో 273 ఎకరాల ప్రభుత్వ భూమిలో వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణానికి రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని ప్రజాభవన్ టౌన్‌హాల్‌లో మొట్టమొదటిసారిగా భూసేకరణకు రైతుల నుంచి మద్దతు కోరుతూ ఏర్పాటుచేసిన సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో 1041 సర్వేనెంబర్‌లో ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రభుత్వ విధివిధానాలను రైతులకు తెలిపారు. రైతులందరూ భూసేకరణకు మద్దతు తెలిపారు. పూర్తి స్థాయి న్యాయంచేయాలని రైతులు వేడుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్న రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో పూర్తిన్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూమిని అనేక ఏళ్లుగా సాగుచేసుకుంటున్న తమకు మార్కెట్‌రేట్ కంటే అదనంగా చెల్లించాలని రైతులు కోరారు. కలెక్టర్, ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో పూర్తి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులందరూ సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం నుంచి మగ్దుమ్‌నగర్ ప్రాంతంలోని 1041 సర్వేనెంబర్‌లోని భూమిని సర్వే చేసేందుకు 5 బృందాలను ఏర్పాటుచేసినట్లు రైతులకు తెలిపారు. 10 రోజుల్లో సర్వే పూర్తిచేసి వ్యవసాయ యూనివర్సిటీకి భూమిని అప్పగించేలా కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ నాగార్జునరెడ్డి, యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జున్‌రావు, గల్లా వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, వెలిదండ వీరారెడ్డి, నాగయ్య, శరత్, కోలపూడి యోహాన్ పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



పరిశ్రమలను తనిఖీ చేస్తున్న పరిశ్రమల జీఎం తేజావత్ సీతారాం

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమ ల పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలని జిల్లా పరిశ్రమల జీఎం తేజావత్ సీతారాం అన్నారు. జిల్లాకేంద్రంలోని కోహన్స్ లైఫ్ సైనెన్స్ (సువెన్‌ఫార్మా), రావుస్ పరిశ్రమలను మంగళవారం తనిఖీ చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పరిశ్రమలోని అగ్నిమాపక పరికరాలను, భద్రత ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో పరిశ్రమల హెడ్ రమేష్‌బాబు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె. శ్రీదేవి, జిల్లా ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అరుణ, మేనేజర్ బి. వెంకటరమణ, దుస్సాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు కాపాడాలి : జడ్పీ సీఈవో

మోతె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను కాపాడాలని జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. మండల పరిధిలోని రాఘవాపురం, క్రాస్‌రోడ్, మోతె గ్రామాల్లో వనమహోత్సవంలో ప్లాంటేషన్ ద్వారా నాటిన మొక్కలను మంగళవారం పరిశీలించారు. నాటిన మొక్కలకు ఉపాధిహామీ సిబ్బంది నీరు పోసి కాపాడాలన్నారు. రోడ్ల వెంట, వీధుల్లో నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి, కార్యదర్శులకు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వనమహోత్సవంలో నాటే మొక్కల టార్గెట్ కోసం అనుమతి తీసుకుని త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఏపీఎం నగేష్ పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో నాలలు, డ్రైనేజీలు, సద్దుల చెరువు కట్ట అలుగును మునిసిపల్ కమిషనర్ సీహెచ్. హన్మంతరెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పట్టణ ప్రజలు మునిసిపల్ అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడిందంటే సెలవే

అర్వపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆందోళన చెందుతున్నారు. 15 ఏళ్ల కిందట కస్తూర్బా పాఠశాలను నీటికుంటలోనే నిర్మించడం భారీ వర్షాలకు ఆవరణ మొత్తం మోకాళ్లలోతు నీరు చేరుతోంది. దీంతో పాఠశాలకు సెలవులు ఇస్తుంటారు. తాజాగా సోమవారం కురిసిన వర్షానికి నీరు చేరడంతో విద్యార్థినులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. విషసర్పాలు, ఇతర క్రిమికీటకాలు ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.



మోకాళ్లోతు నీటిలో నడుస్తున్న విద్యార్థిని, ఆమె తల్లి

భారీ వర్షం వస్తే సెలవు



పిల్లలను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు

అర్వపల్లి కస్తూర్బా పాఠశాలలో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే 240 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకే ఆవరణలో పాఠశాల, హాస్టల్ ఉన్నాయి. ఈ నెల 6, 7వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పాఠశాలకు సెలవు ప్రకటించారు. ఈ నెల 12వ తేదీన తిరిగి రావాలని విద్యార్థులను వారి ఇంటికి పంపించారు. సోమవారం 50 మంది విద్యార్థినులు పాఠశాలకు వచ్చారు. రాత్రికి రాత్రి వర్షానికి పాఠశాల చుట్టూ నీరు చేరడంతో బాలికలు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం ఉదయం పాఠశాల మునిగిపోతుందంటూ కొంతమంది విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఏడుచుకుంటూ కన్నీరుపెట్టుకున్నారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున పాఠశాలకు చేరుకున్నారు. ఆవరణలో మోకాళ్లోతు నీరు నిల్వ ఉండటంతో కొందరు తమ పిల్లలను ఎత్తుకుని బయటకు తీసుకెళ్లారు. మరికొందరిని డీఈవో అశోక్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో గోపి, ఎస్ఐ సైదులు, పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, ఆర్ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినులను ట్రాక్టర్‌లో పాఠశాల బయటికి తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు.

నీరు చేరడంతో భయమేసింది

ఒక్కసారిగా పాఠశాల చుట్టూ వర్షం నీరు చేరడంతో భయమేసింది. రాత్రి బిక్కుబిక్కుమంటూ గడిపాం. ప్రతి ఏడాది వర్షాలు వచ్చినప్పుడల్లా ఈ విధంగానే ఇబ్బందులు పడుతున్నాం. విషపురుగులు వస్తాయని భయమేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలి

పూజ, కస్తూర్బా పాఠశాల, విద్యార్థిని

శాశ్వత పరిష్కారం చూపాలి



వర్షాలు వచ్చినప్పుడల్లా నీరు పాఠశాల ఆవరణలోకి చేరి చెరువును తలపిస్తోంది. పాఠశాల్లోకి నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. నీటిలోనే విద్యార్థినులు పాఠశాలకు వచ్చారు. వారంతా భయాందోళన చెందుతున్నారు.

నాగరాణి, పాఠశాల ఎస్‌వో

డిల్లీలోని పంద్రాగస్టు వేడుకలకు

కోదాడ తేజ విద్యార్థులకు ఆహ్వానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి

కోదాడ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని డిల్లీలో నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తేజ విద్యాలయం విద్యార్థులకు ఆహ్వానం అందినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య సంబురాలను పురస్కరించుకుని రక్షణశాఖ మూడు అంశాలపై దేశవ్యాప్తంగా జూన్ 15 నుంచి జూలై 31వరకు క్విజ్ పోటీలను నిర్వహించింది. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర, సరిహద్దుల్లో సైనికుల పాత్ర, జాతీయ భద్రతలో స్వయం స్వావలంబన ఆవిష్కరణ అనే అంశాల మీద పోటీలు నిర్వహించారన్నారు. ఆయా పోటీల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం పంపించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,15,076 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ చూపిన 200 మందిని రక్షణ శాఖ ఎంపిక చేసి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించిందన్నారు. తమ పాఠశాల నుంచి 182 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 15 మందికి ఆహ్వానం అందిందన్నారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులను అభినందించారు.

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష

● రూ.25 వేల జరిమానా ● రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు

నల్లగొండ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠినకారాగార జైలుశిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ నల్లగొండ న్యాయస్థానం తీర్పునిచ్చింది. మంగళవారం నల్లగొండ జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ ఎస్టీ కోర్టు, అత్యాచారం, పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎన్.రోజారమణి ఈ మేరకు తీర్పు ప్రకటించారు. కేసు వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన వీరంశెట్టి సాంబశివ ఒక బాలికపై అత్యాచారం చేయడంతో ఆమె 2018లో ఫిర్యాదు చేసింది. ఆమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టుకు సమర్పించారు. విచారణ అనంతరం కోర్టు సాంబశివకు 20ఏళ్ల కఠినకారాగార జైలుశిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అదేవిధంగా బాధితురాలికి జిల్లా న్యాయసేవాసహకార సంస్థ ద్వారా రూ.10లక్షల నష్టపరిహారాన్ని త్వరగా చెల్లించాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్, విచారణ అధికారులు ఎస్ఐ జె.శివకుమార్, మిర్యాలగూడ రూరల్ సీఐ జె.రవీందర్, ప్రస్తుత సీఐ పీఎన్‌డీప్రసాద్, ప్రస్తుత ఎస్ఐ వీ.శేఖర్, సీడీవో బొమ్మగాని సత్యనారాయణ, భరోసా లీగల్ సెల్ అధికారి కల్పన తదితరులను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

మరో కేసులో పదేళ్ల జైలు

మర్రిగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నేరస్తుడికి 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఎస్సీ ఎస్టీ జిల్లా కోర్టు న్యాయమూర్తి రోజారమణి మంగళవారం తీర్పు వెల్లడించారు. సీఐ దూది రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిగూడ మండలంలో ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికపై 2016 ఆగస్టు 22న అదే గ్రామానికి చెందిన పోలె నరేష్ లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. అయినా బాలిక భయపడకుండా తల్లికి జరిగిన విషయం తెలిపింది. వెంటనే ఆమె మర్రిగూడ పోలీసులకు ఫిర్యాదుచేసింది. అప్పటి ఎస్ఐ బలరాం కేసు నమోదు చేయగా నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల గంగిరెడ్డి కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం ప్రస్తుత నాంపల్లి సీఐ దూది రాజు సాక్ష్యాధారాలను న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా జడ్జి రోజారమణి కేసు పూర్వాపరాలను పరిశీలించి పోలే నరేష్‌ను దోషిగా నిర్ధారిస్తూ 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేపేల జరిమానాలను విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పు నిచ్చినట్లు సీఐ దూది రాజు తెలిపారు. అదేవిధంగా బాలికకు ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల పరిహారం అందేలా చూడాలని ఉన్నతాధికారులను ఆమె ఆదేశించారని సీఐ దూది రాజు తెలిపారు.

కారు డ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష

కట్టంగూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా కారు నడిపి ఓ మహిళ మృతికి కారణమైన డ్రైవర్‌కు 6నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ మంగళవారం తీర్పునిచ్చారు. కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం 2015 మార్చి 18న శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన బట్ట సుమన్‌తో పాటు అదే గ్రామానికి చెందిన వారి బంధువైన మందుల పరిమళ(20) వారిద్దరూ కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. అయిటిపాముల గ్రామ శివారులోని చెర్వుఅన్నారం క్రాస్ రోడ్డు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న ఏపీ20ఏఎన్8210 నెంబర్ కారు డ్రైవర్ ఆంగోతు కిషోర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న సుమన్ కాలు విరగగా బైకు వెనకాల కూర్చున్న పరిమళ తలకు బలమైన గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమన్ తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ విజయ్‌ప్రకాష్ కేసు నమోదు చేసి పరిశోధన అనంతరం చార్జిషీటును కోర్టులో దాఖలుచేశారు. కేసు విచారణ అనంతరం మంగళవారం నేరస్తుడైన ఆంగోతు కిషోర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిమాణం, రుచీ తక్కువే

● శ్రావణమాసంలో కొబ్బరికి డిమాండ్

● ఒక్కోకాయ ధర రూ.35

● దరకు తగ్గట్టుగా కనిపించని కాయలు



సైజు తక్కువ కొబ్బరికాయలు

మోత్కూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వరుస పండుగలు, శ్రావణ మాసం కావడంతో నిత్యకైంకర్యాలు, పూజలతో కొబ్బరికాయలకు డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు కూడా పెరిగాయి. అయితే గతంలో కాయలు పెద్దగా ఉండేవి. కొబ్బరి కూడా రుచిగా ఉండేది. ఇప్పుడు వస్తున్న కొబ్బరికాయలు నాసిరకంగా, చిన్నవిగా ఉంటున్నాయి. సుమారు రెండు మాసాల క్రితం వరకు ఒక్కోకాయ రూ.20 ఉండగా ఇప్పుడు రూ.35కు పెరిగింది. కొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుంటాయి. ఈ మాసంలో అవసరానికి సరిపోయేంత రావడం లేదంటున్నారు. దీంతో ధరలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గతంలో చాలా రోజులు ఉండేవి, ఇప్పుడు ఐదారు రోజులకన్నా ఎక్కువగా నిల్వ ఉండటం లేదని, కాయ చెడిపోతుందని చెబుతున్నారు. నాసిరకం కాయలు కావడంతో రుచిలోనూ తేడా ఉందంటున్నారు. మున్ముందు స్వాతంత్ర్య దినోత్సవం, వినాయక చవితి పండుగ రానుండటంతో కొబ్బరికాయల ధర మరింత పెరుగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

పెరిగిన కొండుకొబ్బరి, నూనె ధరలు



నెలన్నర రోజుల్లోనే కొబ్బరి నూనెలు, ఎండు కొబ్బరి(కుడుకలు) ధరలు బాగా పెరిగాయి. గతంలో గతంలో 100 ఎంఎల్ కొబ్బరి నూనె బాటిల్ రూ.45 ఉండగా ఇప్పుడు రూ.65కు, 175 ఎంఎల్ నూనె బాటిల్ రూ.65 ఉండగా ఇప్పుడు రూ.115కు, 500 ఎంఎల్ కొబ్బరి నూనె డబ్బా రూ.190 ఉండగా ఇప్పుడు రూ.285కు పెరిగింది. ఎండు కొబ్బరి (కుడుకలు) నెలన్నర క్రితం కిలో రూ.240 నుంచి రూ.250 వరకు ఉండగా ఇప్పుడు రూ.365కు పెరిగాయి. కొబ్బరి నూనె ధర పెరగడంతో తలకు నూనె రాసుకుందామంటే కొనలేని పరిస్థితి ఉందంటున్నారు. శ్రావణ మాసం నుంచి మంచి రోజులు ఉంటాయి. ఆడబిడ్డలకు తల్లిగారింటి వారు బియ్యం పోస్తారు. శుభకార్యాలు కూడా ఎక్కువగా జరుగుతాయి. బంధువులకు నూతన వస్త్రాలు పెట్టేప్పుడు చేతిలో కుడుకలు పెట్టడం సాంప్రదాయం. అందుకు కుడుకలు ఎక్కువగా అవసరముంటాయి. కుడుకల ధరలు పెరగడంతో ఆడబిడ్డలకు బియ్యం పొయ్యాలంటే అయ్యే ఖర్చును చూసి ఆందోళన చెందుతున్నారు. కొబ్బరికాయలు, నూనెలు, కుడుకల ధరలు ఎందుకు ఇంతగా పెరుగుతున్నాయన్న దానికి వ్యాపారులు ఖచ్చితమైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

చీర కొంగు బైక్ చక్రాల్లో చిక్కి వృద్ధురాలు మృతి



సాయమ్మ(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న ద్విచక్రవాహనం చక్రాల కింద చీరకొంగు చుట్టుకుని కిందపడి వృద్ధురాలు మృతి చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మదకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బోయ భిక్షం, తల్లి బోయ సాయమ్మ(70) ఈ నెల 10న చిన్నకొండూరులో బంధువుల అంత్యక్రియలకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తోంది. చౌటుప్పల్ పట్టణ శివారు జాతీయ రహదారిపైన సాయమ్మ ద్విచక్రవాహనం చక్రాల కింద చీర కొంగు చుట్టుకుంది. దీంతో తల్లి, కుమారుడు కిందపడి గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ సాయమ్మను హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ మేరకు భిక్షం భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ..

కోదాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండలం సీత్లాతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ వీరు(45) కోదాడకు పని నిమిత్తం బయలుదేరారు. ఈ క్రమంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై కమ్మగూడెం రోడ్డు సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. అతడి భార్య శ్రీనిధి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.



దత్తప్పగూడెంలో అదుపు తప్పి రోడ్డు పక్క చెట్లలోకి వెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు

అదుపు తప్పిన ప్రైవేట్ స్కూల్ బస్సు

మోత్కూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. మోత్కూరు పట్టణానికి చెందిన సేయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలకు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం విద్యార్థులను గ్రామాలకు తీసుకెళ్తుంది. ఈ క్రమంలో మండలంలోని దత్తప్పగూడెం సమీపంలో అదుపుతప్పి బీటీ రోడ్డు దిగి గుంతలో ఇరుక్కుపోయింది. బస్సులో సుమారు 35 మంది విద్యార్థులు ఉండగా ఒక్కసారిగా బస్సు రోడ్డు దిగడంతో విద్యార్థులు భయంతో కేకలు వేశారు. సమీపంలో గ్రామస్థులు అక్కడకు చేరుకుని వారిని బయటకు దించారు. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపడంతో అదుపుతప్పి కొందరు ఆరోపిస్తుండగా, బైక్‌పై వెళుతున్న వ్యక్తి ఎదురుగా రావడంతో అతడిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి రోడ్డు దిగిందని యాజమాన్యం చెబుతోంది. సంఘటన జరిగిన వెంటనే పాఠశాల యాజమాన్యం అక్కడకు చేరుకుని మరో బస్సు తెప్పించి విద్యార్థులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చింది.

స్టీమ్‌పైప్ పేలి కార్మికుడి మృతి





సదానందం(ఫైల్‌ఫొటో), భువనగిరిలో సదానందం కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్ / భువనగిరి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతిచెందాడు. కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలేరు మండలానికి చెందిన మునిగంటి సదానందం(50) 25 ఏళ్లుగా ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ఉదయం 7-30 గంటలకు ప్లాంట్ బయట స్టీమ్ వద్ద విధులు నిర్వహిస్తున్న క్రమంలో, స్టీమ్ పైప్‌పేలి రాడ్ తలకు బలంగా తగిలింది. తీవ్రంగా గాయపడిన సదానందంను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని భువనగిరి ఏరియా ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. సదానందానికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కంపెనీలో ఎలాంటి పేలుడు సంభవించలేదని అన్నారు. మృతిచెందిన సదానందం కుటుంబానికి రూ. 1.20కోట్ల పరిహారం యాజమాన్యం అందజేస్తామని ఒప్పుకున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి సదానందం ప్రస్తుత వేతనంతో ఒకరికి ఉద్యోగం, అంత్యక్రియలకు రూ.50వేలు ఇస్తున్నట్లు ఒప్పందం కుదిరిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కంపెనీలో తరుచూ ప్రమాదాలు జరుగడం బాధాకరమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. భువనగిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లి సదానందం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద సంఘటనపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ప్రీమియర్ కంపెనీలో ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు పూర్తి విచారణ చేపడతామన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ ఆరోపించారు. ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ నేత గొంగిడి మహేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి తదితర నాయకులు సదానందం కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ముగ్గురి అరెస్టు



శాలిగౌరారంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండల్ రెడ్డి ప్రక్కన ఎస్ఐ సైదులు

శాలిగౌరారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లోని విద్యుత్ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలోని శీలానగర్ చెందిన వావిళ్లపల్లి సాయిరామ జగదీశ్ అలియాస్(శ్రీనివాస్‌రెడ్డి) అతడి తమ్ముడు మహేష్, అక్కడే మరిపాలెం ప్రాంతానికి చెందిన సనపాల సురేష్‌లు ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి తొందరగా డబ్బులు సంపాదించాలనే ఆపేక్షతో పథకం వేసుకున్నారు. వావిళ్లపల్లి సాయిరామజగదీష్ నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన మందుల వెంకన్న, మందుల శివాజీలకు ఫోన్ చేసి తన పేరు శ్రీనివాస్‌రెడ్డి అని నల్లగొండలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో ఏఈగా ఉద్యోగం చేస్తున్నట్లు పరిచయం చేసుకున్నారు. డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, మీరు దరఖాస్తు చేసుకుంటే ఉద్యోగం వస్తుందని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.1,410 ప్రాజెస్ ఫీజు కింద వసూలు చేశారు. అనంతరం వీరు నల్లగొండలోని ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లి విచారించగా అక్కడ శ్రీనివాస్‌రెడ్డి అనే పేరుతో ఎటువంటి అధికారి లేరని తాము మోసపోయారని గ్రహించి ఈ నెల 8న శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ నెల 12న వావిళ్లపల్లి సాయిరామ జగదీష్ హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ సైదులు నకిరేకల్ శివారులోని ఓ హోటల్ వద్ద అతడితో పాటు అతడి తమ్ముడు మహేశ్, సనపాల సురేష్ పట్టుకున్నారు. ఏడాదిన్నర నుంచి సోషల్ మీడియాలో, ఇతర మాద్యమాల ద్వారా ఫోన్ నెంబర్లు సేకరించి నిరుద్యోగులను లక్ష్యంగా చేసి ఒక్కొక్కరి నుంచి రూ.1410 వసూలు చేస్తున్నట్లు విచారణలో తెలుసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు సిమ్‌కార్డులు వాడుతున్నట్లు ఎస్ఐ గుర్తించారు. వీరి నుంచి 11 మొబైల్ ఫోన్లు, 7 బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకాలు, రూ.1600 స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి నిందుతులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోదాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో జరిగింది. ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణంలోని గోల్డెన్‌సిటీలో నూకల మహేష్(35) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి ఉరివేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మహేష్ అన్న శంకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక డంపు సీజ్

డిండి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రానికి టిప్పర్ల ద్వారా తరలించిన ఇసుకను మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజ్ చేసిన ఇసుకను మైనింగ్ అధికారులకు స్వాధీనం చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక తరలించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక తరలించినవారిని బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో క్రీడా సామాగ్రి చోరీ

బొమ్మలరామారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగినట్లు ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం సోమవారం పాఠశాల తెరిచేందుకు వెళ్లగా వంట గదితో పాటు క్రీడా సామాగ్రి భద్రపరిచే గది తలుపులు ధ్వంసం చేసి ఉన్నాయన్నారు. బీరువాలో దాచిన విలువైన స్పోర్ట్స్ సామాగ్రిని చోరీ చేశారని ఆమె తెలిపారు. మూడు రోజుల పాటు పాఠశాలకు సెలవులు రావడంతో పాఠశాల ఆవరణలో మద్యం తాగిందుకు అడ్డాగా మార్చారన్నారు. తాగేసిన సీసలను తరగతి గదుల్లో పగలగొట్టి వెళ్లారని తెలిపారు. పాఠశాలలో జరిగిన చోరీపై స్థానిక పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు.

నిత్యపెళ్లికొడుకు సస్పెన్షన్

మునగాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ కృష్ణరాజును ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా నిత్య పెళ్లికొడుకు అవతారం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. కృష్ణంరాజు ఇప్పటివరకు మూడు పెళ్లిళు చేసుకున్నారని, అందులో మైనర్ బాలికను వివాహం చేసుకొని వదిలేసిన విషయాలపై విచారణ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీస్ యూనిఫాంతో ఉన్న వారు నిబంధనలు ఉల్లంగిస్తే శాఖ పరిమైన చర్యలు ఉంటాయన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



కళాశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ మువ్వా రామారావు

మిర్యాలగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ తగినంత పౌష్టికాహారం తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం గిరిజన గురుకుల బాలికల కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, సమూహ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిచయం శాస్త్రీయ దృక్పథం అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత లేకుండా ఉండాలంటే రోజూ ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని, కోడిగుడ్డు, పప్పు లాంటి ఐరన్, ప్రొటీన్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. భారత్ బచావో జిల్లా అధ్యక్షురాలు ఉదయ్ మాట్లాడుతూ స్త్రీలు రాజ్యాంగంలో పొందుపరిచిన స్వేచ్ఛ, సమానత్వం సమాన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. దీంతో స్త్రీలు సాధికారతను సాధించవచ్చన్నారు. సమూహ రైటర్స్ ఫోరం నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో 51-హెచ్ ప్రకారం ప్రతీ పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంతర్గత మురుగుకాల్వ

పనులను పూర్తిచేయాలి

మిర్యాలగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలో అంతర్గత మురుగుకాల్వల పనులను వెంటనే పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.1200కోట్లతో 17 మునిసిపాలిటీల్లో అంతర్గత డ్రైనేజీ, వాటర్ సప్లయ్ పనులను ఏడాది క్రితం ప్రారంభించారన్నారు. కాగా పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బావండ్ల పాండు, జిల్లా నాయకులు గుణగంటి రామచంద్రు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లుట్ల సైదులు, చారీ, వాడపల్లి రమేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించాలి

మిర్యాలగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ లేన్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేయాలని తెలంగాణ ఎత్తిపోతల పథకాల రైతుల సంఘం అధ్యక్షులు పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎత్తిపోతలకు ప్రత్యేక విద్యుత్ లేన్లు ఏర్పాటుచేసి నిరంతరం కరెంటు సరఫరా చేసి చివరి భూములకు సాగు నీరందించేలా చూడాలన్నారు. సమావేశంలో కందుకూరి రమేష్, పిల్లుట్ల సైదులు, భాషా పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

● నిండుకుండలా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులు

రెండు, మూడు రోజులుగా కురుస్తున్నవర్షాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లి చెరువులు అలుగుపారుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



డిండి ప్రాజెక్టు రిజర్వాయర్

నాగార్జునసాగర్, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి) : కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఎగువన కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో సాగర్‌కు ఎగువన ఉన్న అన్నీ ప్రాజెక్టుల గేట్లు తెరుచుకున్నాయి. కృష్ణమ్మ బిరబిరా పరుగులిడుతూ సాగర్ వైపునకు వడివడిగా వస్తోంది. సాగర్ ప్రాజెక్టుకు వరద రాక పెరిగింది. నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద రాక పెరిగింది. రెండు రోజులుగా 65వేల క్యూసెక్కుల నీరు రాగా, మంగళవారం 1,86,380 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,44,864 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా, మంగళవారం ఉదయం 10గంటలకు ఎగువనుంచి వరద రాక పెరగడంతో మరో 4 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి మొత్తం ఎనిమిది గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. 11గంటలకు మరో 4 గేట్లు ఎత్తి 12 గేట్ల ద్వారా, 12 గంటలకు మరో నాలుగు గేట్లను ఎత్తి 16 గేట్ల నుంచి, మధ్యాహ్నం 2 గంటలకు రెండు గేట్లను ఎత్తి మొత్తం 18 గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 589.50 అడుగులుగా (310.5510 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 7,086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3,910 క్యూ సెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, 18 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,44,864 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువనుంచి 1,86,380 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు.

మూసీకి పోటెత్తిన ఇన్‌ఫ్లో...

కేతేపల్లి, వలిగొండ : హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాల్లో వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు సోమవారం వరద పోటెత్తింది. దీంతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల నడుమ గల మూసీ ప్రాజెక్టుకు వారం రోజులుగా ఇన్‌ఫ్లో భారీగానే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇన్‌ఫ్లో 16722.45 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో అప్పటివరకు 2 అడుగుల మేర ఎత్తి ఉంచిన ప్రాజెక్టు 2,3,10 నంబరు క్రస్ట్ గేట్లకు తోడు 4,8 నంబరు క్రస్ట్‌గేట్లను కలిపి మొత్తం ఐదుగేట్లు 5అడుగుల మేర ఎత్తి 16,125 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి వదిలారు. మంగళవారం సాయంత్రం వరకుకొనసాగిన వరద ఉధృతి ఆ తర్వాత కొంత నెమ్మదించడంతో 4 నంబరు క్రస్ట్‌గేటును మూసివేశారు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు నాలుగు క్రస్ట్ గేట్లతో 7388. 88 క్యూసెక్కుల వరదనీటి విడుదల కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉంటే 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.22 అడుగులు (4టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 231.22 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వలిగొండ మండలం భీమలింగం కత్వ వద్ద భారీగా నీరు చేరడంతో వలిగొండ మండలం సంగెం-బొల్లేపల్లి మధ్య నాలుగు రోజులుగా రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న వలిగొండకు వచ్చి ఆయా గ్రామాలకు వెళుతున్నారు. మూసీ పరివా హకంతో పాటు బోరు, బావులు, కాల్వల కింద వరి నాట్లు ఊపందుకున్నాయి.

పులిచింతలకు భారీగా వరద

చింతలపాలెం : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో పులిచింతల ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 1,82,656 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 17 వేల క్యూసెక్కులు రాగా 6 గేట్లు నాలుగు మీటర్లు, ఒక గేటు 2.5 మీటర్లు ఎత్తి 2,20,121 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 173.062 నిల్వ ఉన్నది. ప్రాజెక్టులోకి వచ్చిన వరద వచ్చినట్టుగా దిగువకు వదులుతున్నారు.

నిండుకుండలా డిండి జలాశయం

డిండి : ఎగువన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు డిండి రిజర్వాయర్‌కు నీరు వచ్చి చేరుతుండడంతో జలాశయం జలకళ సంతరించుకుంది. దీంతో రైతులతో ఆనందం వెల్లువిరుస్తోంది. ప్రాజెక్టు నుంచి గతనెల 30న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ నీటిని విడుదల చేయడంతో రైతులు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ బోర్లు, బావులు ఉన్న రైతులు వానాకాలం నార్లు పోయగా నీటి వనరులు ఉన్న మరికొందరు రైతులు అక్కడక్కడ నాట్లు వేశారు. డిండి ప్రాజెక్టు నీటి విడుదల సమయంలో 17.10 అడుగులు మాత్రమే నీరు ల్వ ఉంది. ఆగస్టు మొదటివారం నుంచి దుందుభి వాగు పరవళ్లు తొక్కుతూ డిండి ప్రాజెక్టుకు వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 36 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 29 అడుగులకు చేరింది. వర్షపు నీటికితోడు కల్వకుర్తి ఎత్తిపోతల ప్రధాన కాలువ నీరు వచ్చి చేరుతుండడంతో మూడు, నాలుగు రోజుల్లో డిండి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అయ్యే అవకాశాలు ఉన్నాయి.

వర్షాధార, మధ్యతరహా ప్రాజెక్టు అయిన డిండి రిజర్వాయర్ గతంలో నాలుగేదళ్లకు ఒక్కసారి భారీ తుఫాన్లు వచ్చినప్పుడు మాత్రమే నీరు వచ్చి చేరేది. గత 7 ఏళ్లుగా వర్షపునీటికి కల్వకుర్తి ఎత్తిపోతల నీరు కూడ తోడవ్వడంతో ఆయకట్టు పరిధిలోని 12, 500 ఎకరాలు సాగులోకి వచ్చింది. గతేడాది వానాకాలం యాసంగి రెండు సీజన్‌లకు నీరు అందడంతో రైతులు వరిసాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



బంకాపురం వాగుకు అడ్డుగా ఏర్పాటు చేసిన బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

పొంగుతున్న నిడమనూరు చిలుకల వాగు

నిడమనూరు : నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లోని చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. లెవెల్ కెనాల్(ఎల్ఎల్‌సీ)కు కూడా నీటిని విడుదల చేయడంతో చెరువులు జలకళను సం తరించుకుంటున్నాయి. మండల కేంద్రంలోని నల్లచౌట చెరు వు పూర్తి స్థాయిలో నీటితో నిండి అలుగు పోస్తుంది. అదేవిధంగా నిడమనూరు చిలుకల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బంకాపురం కల్వర్టు మీదుగా వరదనీరు ముంచెత్తింది. దీంతో మండలంలోని నిడమనూరు మీదుగా బంకాపురం, వెనిగండ్ల తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసులు ముందు జాగ్రత్తగా వాగుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేయించారు. దీంతో బంకాపురం, వెనిగండ్ల గ్రా మాలకు 14వ మైలురాయి చెక్‌పోస్టు మీదుగా ప్రయాణాలను మళ్లించారు.

మూసీని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు..



భీమారం లోలెవల్ కాజ్‌వే వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కేతేపల్లి , సూర్యాపేట రూరల్ : హైదరాబాద్ నగరంతో పాటు ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లుతున్న మూసీ ప్రాజెక్టును నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి జిల్లా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం, డ్యామ్‌కు గల వివిధ రకాల గేట్లు, సాగునీటి విడుదలకు గల కాల్వలు వాటి సామర్థ్యాలను నీటిపారుదల శాఖ, మూసీ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామ శివారులో మూసీ నదిపై గల లోలెవల్ కాజ్‌వేను పరిశీలించారు. సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి భీమారం మీదుగా మిర్యాలగూడ పట్టణానికి ఈ కాజ్‌వే మీదుగా వెళ్లే వాహనాలు ప్రమాదం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మూసీ అధికారులతో సమన్వయం చేసుకుని డ్యామ్ నుంచి నీటి విడుదల పరిమాణం పెరిగిన సమయాల్లో భీమారం కాజ్‌వే వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి వాహనాలను వయా కొప్పోలు, భీమారం మీదుగా మిర్యాలగూడ మళ్లించాలని సూచించారు. కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరమణ, మూసీ డీఈ చంద్రశేఖర్, జేఈ కీర్తి, వాణి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎస్ఐ యు.సతీష్, ఆర్ఐ వెంకన్న, ఏఆర్ఐ రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఎస్పీ

భారీ వర్షాల నేపథ్యంలో మూసీ నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారం గ్రామ శివారులో మూసీ నదిపై గల లోలెవల్ కాజ్‌వే వద్ద వరద నీటి ఉధృతిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట-మిర్యాలగూడ పట్టణాల మధ్య రాకపోకల సాగించే వాహనదారులు లోలెవల్ కాజ్‌వేపై ప్రయాణించే సందర్భంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సూచించారు.



మూసీ ఉధృతిని పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

ఆమనగల్లు చెరువుకు మూసీ వరద

వేములపల్లి : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో పెద్ద చెరువైన ఆమనగల్లు ఊర చెరువుకు మూసీ నుంచి మంగళవారం భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో చెరువు నిండుకుండలా మారి చెరువు అలుగుపోస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు నీటమునిగి లక్ష్మీదేవిగూడెం శివారులోని భీమారం-సూర్యాపేట రహదారిపైగల లోలెవల్ వంతెన పైకి అలుగునీరు వచ్చి చేరడంతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.



అలుగుపోస్తున్న వేములపల్లి మండలం ఆమనగల్లు చెరువు

పర్యావరణ పరిరక్షకులుగా విద్యార్థులు తీర్చిదిద్దాలి

నల్లగొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని డిగ్రీ, పీజీ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పార్మాకల్చర్, ఘన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పునరుద్ధరణపై అవగాహన కల్పించాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఈ కార్యక్రమానికి సంబంధించి పశ్చిమబెంగాల్, డార్జిలింగ్‌లోని టీడీ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులైన యువత పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఉత్సవ్ ప్రధాన్ తేడీతో పాటు అకాడమీ సెల్ డైరెక్టర్ సురేష్ రెడ్డి, మిర్యాల రమేష్, ప్రేమ్ సాగర్, తిరుమల రామచందర్‌గౌడ్, శివరాం, సమిన్, ఖాజ్మీ, మురళి , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల ఎస్ఈగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎస్ఈగా శ్రీనివాస్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. డిండి ఇన్‌చార్జి ఎస్ఈగా బద్రునాయక్ నుంచి బాధ్యతలను చేపట్టారు. నల్లగొండ జిల్లాలో ఉదయ సముద్రం ఈఈగా, వరంగల్ జిల్లాలో పొల్యూకంట్రోల్ ఎస్ఈగా పనిచేశారు. ప్రమోషన్‌పై ఎస్ఈగా డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనకు కార్యాలయ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాగార్జునసాగర్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో తెలుగు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవిలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాసై ఉండాలని సూచించారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ. అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీన తన ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె సూచించారు పూర్తి వివరాలకు 9492540363 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు మంజూరు

● రైతులకు రాయితీపై యంత్రాలు, పరికరాలు ● ఉమ్మడి జిల్లాకు రూ.14.65 కోట్ల నిధులు

(ఆంధ్రజ్యోతి -మోత్కూరు): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల భారీవర్షాలు కురవడంతో సాగు పనులు ఊపందుకున్నాయి. అయితే కూలీల కొరత విపరీతంగా ఉంది. ట్రాక్టర్లతో దున్నడమే కాకుండా పలు రకాల పనులు యంత్రాలతో చేసే అవకాశమున్నా యంత్రాల ధరలు ఎక్కువగా ఉండడంతో రైతులు వాటి కొనుగోలు చేయలేక కూలీలపైనే ఆధారపడుతున్నారు. కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు ఇచ్చేది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ట్రాక్టర్లు ఇచ్చి ఆ తర్వాత నిలిపివేసింది. తాజాగా సబ్సిడీపైయంత్ర పరికరాలు ఇవ్వడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

ఎనిమిదేళ్ల తర్వాత...

వ్యవసాయ రంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు ప్రవేశపెడుతున్నాయి. ఇందులో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగులో ఆధునిక యంత్రాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ (ఫామ్ మెకనైజేషన్) పథకం ప్రవేశపెట్టింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో ట్రాక్టర్లు ఇచ్చి ఆ పథకాన్ని అటకెక్కించేసింది. యంత్రలక్ష్మి పేరుతో ప్రవేశపెట్టిన పథకం మున్నాళ్ల ముచ్చటే అయ్యింది. సుమారు ఎనిమిదేళ్లుగా రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందక, పూర్తి డబ్బు పెట్టి కొనలేక ఇబ్బందులు పడ్డారు. సబ్సిడీ యంత్ర పరికరాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాకు రూ.14.65 కోట్లు మంజూరు

రైతులకు వ్యవసాయ యంత్రాలు, పరికరాలు సబ్సిడీ పై అందించడానికి ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.14.65 కోట్లు మంజూరు చేసింది. ఇందులో నల్లగొండ జిల్లాకు రూ.8.91 కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.4,47,16,000, యాదాద్రి భువనగిరి జిల్లాకు రూ.1,27,44,000 కేటాయించారు.

40 నుంచి 50 శాతం రాయితీ

వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందించనున్నాయి. ఎస్సీ ఎస్టీ, మహిళా రైతులకు రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీ ఇస్తారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రొటోవేటర్లు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్స్, డిస్కుహారో, కల్టివేటర్, ఎంబీపుష్, కేజీవీల్స్, ప్లౌ, పవర్ వీడర్స్ బండ్ ఫార్మర్స్ పవర్ టిల్లర్, గడ్డి కట్టలు కట్టే యంత్రాలు సబ్సిడీపై ఇవ్వనున్నారు.

జిల్లాల వారీగా కేటాయింపు ఇలా..

యాదాద్రి భువనగిరి జిల్లాకు 1289 బ్యాటరీ స్ప్రేయర్లుకు రూ.12.89 లక్షలు, 204 పవర్ స్ప్రేయర్లకు రూ.20.40లక్షలు, 63 రొటటోవేటర్లకు 31.50లక్షలు, 17 సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్స్‌కు రూ.5.10లక్షలు, 61 డిస్కుహారో, కల్టివేటర్, ఎంబీప్లౌ, కేజీవీల్స్‌కు రూ.12.20లక్షలు, 8 బండ్ ఫార్మర్స్ (నాన్ పీటీవో, పీటీవో)కు రూ.6.60లక్షలు, 8 పవర్ వీడర్స్‌కు రూ.2.80లక్షలు, 17 బుష్ కట్టర్స్‌కు రూ.5.95లక్షలు, 12 పవర్ టిల్లర్స్‌కు రూ.12 లక్షలు, 18 గడ్డి కట్టలు కట్టే యంత్రాలకు రూ.18లక్షలు కేటాయించారు. సూర్యాపేట జిల్లాకు 4,366 బ్యాటరీ స్ప్రేయర్లుకు రూ.43.66 లక్షలు, 647 పవర్ స్ప్రేయర్లకు రూ.64.70 లక్షలు, 195 రొటోవేటర్లకు రూ.97.50 లక్షలు, 46 సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్స్‌కు రూ.13.80 లక్షలు, 290 డిస్కుహారో, కల్టివేటర్, ఎంబీప్లౌ, కేజీవీల్స్‌కు రూ.58 లక్షలు, 35 బండ్ ఫార్మర్స్ (నాన్ పీటీవో, పీటీవో)కు రూ.32.25 లక్షలు, 25 పవర్ వీడర్స్‌కు రూ.8.75 లక్షలు, 50 బుష్ కట్టర్స్‌కు రూ.17.50 లక్షలు, 33 పవర్ టిల్లర్స్‌కు రూ.33 లక్షలు, 58 గడ్డి కట్టలు కట్టే యంత్రాలకు రూ.58 లక్షలు, 20 మొక్కజొన్న గింజలు వలిచే యంత్రాలక రూ.20 లక్షలు కేటాయించారు.

దరఖాస్తుకు రేపే ఆఖరు తేదీ

వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై పొందడానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 14 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎంపిక విధానం

రాయితీ పరికరాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న రైతుల నుంచి లబ్ధిదారుల ఎంపిక కోసం రెండు కమిటీలు ఏర్పాటు చేస్తారని తెలుస్తుంది. ఒక కమిటీలో మండల వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎంపీడీవోలు సభ్యులుగా ఉంటారని, ఈ కమిటి రూ.లక్ష లోపు విలువ కల్గిన యంత్రాలను పొందాలనుకున్న లబ్ధిదారులను ఎంపిక చేస్తుందంటున్నారు. మరో కమిటీలో కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, ఆగ్రోస్ రీజినల్ మేనేజర్, వ్యవసాయ శాస్త్రవేత్త, లీడ్ బ్యాంకు మేనేజరు సభ్యులుగా ఉంటారంటున్నారు. రూ.లక్షపైన ధర ఉన్న యంత్రాలు పొందే లబ్ధిదారులను ఈ కమిటీ ఎంపిక చేయనున్నది

రైతులు వినియోగించుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తుంది. గురువారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. ఆసక్తి, అవసరం ఉన్న రైతులు తమకు కావాల్సిన యంత్ర పరికరాల కోసం సంబంధిత ఏఈవో, లేదా ఏవోలకు దరఖాస్తు చేసుకోవాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- పి.వి.రమణారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, యాదాద్రి భువనగిరి

ప్రభుత్వ ఆస్పత్రిలో పేదోడికి న్యాయం జరగాలి

● ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే ● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



ఎలగలగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ సత్యం

మునుగోడు/మునుగోడు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికిలో పేదోడికి న్యాయం జరగాలి, ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రైవేట్ పాఠశాలలు పేదవాడి రక్తం తాగుతున్నాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండల పరిధిలోని ఎలగలగూడెం గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆనాడు సరేనా నిధులు లేక నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం మునుగోడు నియోజకవర్గంలో అన్ని రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తామని అన్నారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోటి నారాయణ, పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వరరావు, ఏఈ సతీష్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, సీపీఐ జిల్లా నాయకులు గురిజ రామచంద్రం, తీర్పాటి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనంత లింగస్వామి గౌడ్, ఈదులకంటి కైలాస్, మాజీ సర్పంచులు సురిగి చలపతి, తాటికొండ సైదులు, మిర్యాల వెంకన్న, జాల వెంకన్న, జక్కుల శ్రీనివాస్, మేకల శ్రీనివాస్ రెడ్డి, పోలగొని ప్రకాష్ గౌడ్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

'మన ఊరు. మన మండలం. మన నియోజకవర్గం.. మనమందరం..' అనే నినాదంతో స్థానిక నేతలందరూ సామాజిక దృక్పథంతో అభివృద్ధి కోసం భాగస్వాములు కావాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిలో స్థానిక ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం జరిగింది. అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణపై ప్రత్యేకంగా చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనవంతు బాధ్యతగా నామాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరుతో నిధులు కెటా యిస్తూ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నానని తెలిపారు. నియోజకవర్గంలో తొలి ప్రాధాన్యంగా విద్యాలయాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టామన్నారు. నాయకులే కాదు ఎన్నారైలు సైతం అభివృద్ధిలో భాగస్వామ్యం అయితేనే మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

నిషేధిత కలుపు మందు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి

మోత్కూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన గ్లైఫోసెట్ కలుపు నివారణ మందును ఎరువుల దుకాణాల్లో విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని సేంద్రియ రైతు బిళ్లపాటి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం ఎంఏవో వి.కీర్తికి వినతి పత్రం అందజేశారు. మోత్కూరు మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఈ కలుపు నివారణ మందును వి చ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. హైడోస్ కలిగిన గ్లైఫోసెట్ మందు పిచికారీ చేయడం వల్ల మనుషులకు, పశువులకు పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వారాల నరేష్, చాతరాశి వెంకన్న, నోముల రమేష్ ఆయన వెంట ఉన్నారు.

క్షేత్ర పాలకుడికి నాగవల్లీ దళార్చనలు



యాదాద్రిలో హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజ నేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహ డికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండ పైన విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసినా అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు రూ.15,48,666 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధి గాంచిన మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ లక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రోచ్ఛరణాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచానం, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర కుంకుమార్చనలు, అనంతరం కల్యాణ తంతులో భాగంగా ఎదుర్కోళ్ల మహోత్సవంతో కల్యాణాన్ని కమనీయంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో జన్మించిన ఆడ శిశువు

108లో మహిళ ప్రసవం

పెద్దవూర, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):పురిటినొప్పులు ఎక్కువై 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పర్వేదుల గ్రామంలో మంగళవారం జరిగింది. అంబులెన్స్ ఈఎంటీ కె.రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పర్వేదుల గ్రామానికి చెందిన ఎలిమినేటి శిరీష పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. వెంటనే ఈఎంటీ రాకేష్, పైలట్ గణేష్ నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ రాకేష్ డాక్టర్ శ్రీకాంత్ సూచనల మేరకు వైద్యం అందించి గర్భిణికి సుఖప్రసవం అయ్యే లా చూశాడు. మహిళ ఆడబిడ్డకు జన్మనివ్వ గా తల్లి బిడ్డా క్షేమంగా ఉండడంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి **
సూర్యాపేట
కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి
8 www.andhrajyothy.com ● బుధవారం 13 ఆగస్టు 2025

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రిటైర్డు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ చుంచు గురవయ్య, ఎంఈవో తల్లాడ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని గొండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాత సహకారంతో 120 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా దాతలను వీపీసీఎస్ గొట్టిముక్కల లత సన్మానించారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

సూర్యాపేట క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపాల నిర్వాహకులు ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ నర్సింహా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. డీజేలు, బాణాసంచాలకు అనుమతి లేదన్నారు. మండపాలు రోడ్లపై ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. నిబంధనలను మండపాల నిర్వాహకులు పాటించాలని అన్నారు.

అర్వపల్లి అతలాకుతలం..నిండు కుండలా చెరువులు

సగటున 43.1మి.మీ వర్షపాతం నమోదు

సూర్యాపేట టౌన్, అర్వపల్లి, నూతనకల్, ఆత్మకూర్ (ఎస్), తిరుమలగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొర్లుతున్నాయి. దంతాలపల్లి, సూర్యాపేట రహదారి నూతనకల్ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవ హిస్తూ వంతెను తాకుతూ వరద నీరు ప్రవహిస్తోంది. ఆత్మకూర్(ఎస్)మండలం ఏపూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఏపూరు గ్రామానికి రాకపోకలు నిలిచాయి. తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం మండలాల్లో చెరువులు అలుగులు పోయడంతో పాటు వాగులు పొంగి రోడ్లపైకి వరద నీరు ప్రవహిస్తోంది. జిల్లాలో 900 చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది.



అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరద

అతలాకుతలమైన అర్వపల్లి

సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం నాలుగు గంటల వరకు కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. సూర్యాపేట-జనగాం రహదారి వెంట ఉన్న 20కుటుంబాల ఇళ్లలోకి నీరు చేరడంతో రాత్రంతా నిద్ర లేక ఆందోళనతో గడిపారు. నీటిని ఎత్తిపోయడానికి కూడా వీలు లేనందున ప్రజలు రోడ్డుపైనే ఉన్నారు. శ్రీరాంసాగర్ రెండో దశ 71డీబీఎం మెయిన్ కాల్వలోకి వరద నీరు ప్రవహించింది. సుమారు 800 క్యూసెక్కుల నీరు ప్రవహించడంతో గోదావరి జలాలు విడుదల చేశారా? అని ప్రజలు ఆశ్చర్యంగా చూశారు. మండలంలో 60 చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. కొడూరు, కొమ్మాల చెరువులు ప్రమాదకరంగా అలుగులు పోస్తున్నం దున రాకపోకలు బంద్ అయ్యాయి.

● నూతనకల్ మండలంలో గుండ్లసింగారం చెరువు పొంగి పొర్లుతున్నం దున సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిలో ఉన్న వంతెన నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వరద ప్రవాహాన్ని మండల ప్రత్యేకాధికారి బాలు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. వరద ఉధృతి పెరిగితే రాకపోకలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. గుండ్లసింగారం ఆనకట్ట పొంగుతుండడంతో పర్యాటకుల సందడి పెరిగింది. సెల్ఫీల కోసం ప్రవాహం వద్దకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.

నాగారంలో గరిష్ఠంగా 187.9 మి.మీ వర్షపాతం

జిల్లాలో గరిష్ఠంగా నాగారంలో 187.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా మట్టంపల్లిలో 1.9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 362 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 43.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

● ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏపూరు ఏటికి వరద తీవ్రత పెరిగింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి వరద ప్రవాహం వంతెన పైనుంచి వెళ్లడంతో ఏపూరు-మిర్యాల గ్రామాలకు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సూర్యాపేట నుంచి ఏపూరు మీదుగా మరిపెడ బంగ్లా వరకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి.



నూతనకల్ మండలంలో పొంగి పొర్లుతున్న గుండ్లసింగారం చెరువు

●తిరుమలగిరిలో కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి అలుగులు పోస్తున్నందున రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



అర్వపల్లి సంతలో ఆగిన నీరు



ఏపూరు వంతెనపై ప్రవహిస్తున్న నీరు



అర్వపల్లిలో వరదతో నిండిన ఓ వీధి



తిరుమలగిరిలో అలుగు పోస్తున్న మాలిపురం చెరువు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక నిఘా

ఎస్ఐ ప్రవీణ్‌కుమార్



బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక నిఘా పెట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతి, మునగాల)

ఆంధ్రజ్యోతి: హైవేలోని బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్ఐ: బ్లాక్ స్పాట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా పెట్టాం.

ఆంధ్రజ్యోతి: బైక్‌లు నడిపే మైనర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్ఐ: మైనర్లకు ఎట్టి పరిస్థితిల్లోనూ బైక్‌లు ఇవ్వద్దు, ఇస్తే బాధ్యులపై కేసు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోజువారీగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిశీలిస్తున్నరా?

ఎస్ఐ: ఫిర్యాదులను వెంటనే పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాలని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్ఐ: రాత్రి పూట మండలంలోని పలు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్ నియంత్రణకు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్ఐ: డ్రగ్స్ నిర్మూలకై గ్రామాల్లో, ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం

ఆంధ్రజ్యోతి: హెల్మెట్ ధరించనివారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్ఐ : హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం.

సర్వర్ల మొరాయింపు

తుంగతుర్తి, మద్దిరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ యాప్‌లతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు స్వరూప అన్నారు. మంగళవారం మండలంలోని వెంపటి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులకు పోషకాహార పదార్థాల పంపిణీలో సమస్యలు ఏర్పడుతున్నాయని, యాప్‌లో లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ చేయడంతో సర్వర్ బిజీ అని రావడంతో ఫొటో తీసుకోవడానికి చాలాసమయం పడుతోందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సర్వర్ రాక చాలా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఒక నెల పోషకాహారాన్ని లబ్ధిదారులు తీసుకోకపోతే మరుసటి నెల కోత విధిస్తున్నారన్నారు. . ఈ యాప్‌లతో చిన్నారులు విద్యకు దూరం అవుతున్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఈకేవైసీ చేయడం జాప్యం అవుతోందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ యాప్‌లను తొలగించాలని కోరారు. సమావేశంలో వసంత పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేసే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు నేటితో ముగియనుంది. సోమ, మంగళవారాల్లో సర్వర్ మొరాయించడంతో రైతులు, ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గడువు పెంచాలని పలు గ్రామాల రైతుల మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అనూష, అయేషా, మనోహర్, రైతులు పాల్గొన్నారు.

రైతు బీమాకు నేడు చివరి అవకాశం: డీఏవో శ్రీధర్‌రెడ్డి



కేసారం రైతు వేదికలో దరఖాస్తులను స్వీకరిస్తున్న డీఏవో శ్రీధర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి నేడే ఆఖరు తేదీ అని జిల్లా వ్యవసాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కేసారం రైతువేదికలో రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 నూతనంగా పట్టాదారు పుస్తకాలు పొందినన రైతులు క్లస్టర్ విస్తరణాధికారికి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్నవారు రైతు బీమాకు అర్హులన్నారు. రైతు బీమా దరఖాస్తుకు రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, పట్టాదారు పుస్తకం/ డిజిటల్ సంతకమైన పత్రాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణసందీప్, ఏఈవో ముత్తయ్య, రైతులు పాల్గొన్నరు.

●ఆత్మకూర్(ఎస్): అర్హులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో దివ్య కోరారు. మండలంలోనితుమ్మలపెన్‌పహాడ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందగా జిల్లా గ్రంథాలయ భవనానికి స్థలాన్ని పరిశీలించి, ఈ భవన నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 15నశంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వి.శ్యాంసుందర్‌రెడ్డి, భాస్కర్, ఎంవీ రంగారావు, కర్నాటి కిషన్, కిశోర్, వెంపటి వెంకటేశ్వర్‌రావు, బండారు రాజా, చల్లా లక్ష్మీకాంత్, తప్పి గాంధీ, చంద్రశేఖర్, మల్లికార్జున్, రాము పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమానికి మూల పురుషుడు రంగనాథన్

. కోదాడటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమానికి మూల పురుషుడు ఎస్ఆర్ రంగనాథన్ అని కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హదసరాణి అన్నారు. ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఇన్ ఇండియా, పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం కోదాడలోని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, కళాశాల గ్రంథాలయ అధికారి మాతంగి యాకోబు, అధ్యాపకులు నిర్మలకుమారి, ఎస్ఎం రఫీ, పల్లపాటి సైదులు, ఫ్రాన్సిస్, సుమలత, సైదమ్మ, అధ్యాపకేతర సిబ్బంది, వేణుగోపాల్, ఇస్మాయిల్, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.



కోదాడలోని కేఆర్ఆర్ కళాశాలలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ హదసరాణి, అధ్యాపకులు

కనీస వేతనాల చట్టాలను సవరించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కార్మికుల కనీస వేతన చట్టాలను సవరించాలని చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల అధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో వివిధ పరిశ్రమల్లో, ప్రభుత్వ శాఖల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, కొత్తపల్లి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

హుజూర్‌నగర్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ముత్యాలమ్మ జాతర కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌ను కలిసి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతరకు హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తండ ప్రసాద్, వేముల నర్సయ్య, కంచర్ల అరవిందరెడ్డి, బెల్లంకొండ అమర్, పశ్య శ్రీనివాసరెడ్డి, రామిశెట్టి రాము, పేరం నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు సూర్యాపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అంజాద్ అలీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంగళవారం హైదరాబాద్ నుంచి విజయవాడ వెళుతూ సూర్యాపేటలోని సెవెన్ ఆర్ హోటల్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి అహర్నిశలూ కృషి చేయలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్‌రావు, ఆలేటి మాణిక్యం, పందిరి మల్లేషగౌడ్, నాగుల వాసు, జావీద్ బేగ్, నిఖిల్, సంజయ్, శివ, మధు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళకు ఆర్థికసాయం

తుంగతుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన 28ఏళ్ల బాలె సత్యవతి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి పక్షవాతంతో బాధపడుతోంది. సమాచారం తెలుసుకున్నశారదా సేవా ట్రస్ట్ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉన్న సత్యవతి పరామర్శించి ట్రస్ట్ నుంచి రూ. 10వేల ఆర్థికసాయం అందించారు. ఆమె కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శారద సేవా నిధి ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ శిల్ప, జాయింట్ సెక్రటరీ గౌరోజు కృష్ణవేణి, కోశాధికారి రెడ్డబోయిన నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలె కమలాకర్, మేడుదుల సుధాకర్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

తుంగతుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 2003-04బ్యాచ్ పదో తరగతి విద్యార్థి గోపగాని మహేష్‌కు ఇటీవల పక్షవాతం వచ్చింది. ఆయనను తోటి స్నేహితులు మంగళవారం పరామర్శించి రూ.14వేలు ఆర్థికసాయం అందజేశారు. మహేష్‌కు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు షేక్ యాకుబ్, రుద్ర సతీష్, కొండ సందీప్, కల్లూరి గణేష్, వడ్లకొండ సైదులు, షేక్ నబీ, కోట గోపి, యట్టం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

కోదాడ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని హెచ్ఎం మార్కండేయులు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కోదాడలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటలు, క్రీడలు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, రన్నింగ్, చెస్, క్యారం టెన్నీకాయిట్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించించారు. గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తామని హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ ఎం. నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

నేరేడుచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేరేడుచర్లలోని స్పందన కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలలను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని ఆయా కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో కొమ్రాజు వెంకట్, చిలకరాజు శ్రీను, భరత్, సతీష్, సాయి, అబ్బాస్, సందీప్, యశ్విత, రూప, తేజశ్రీ, రఘు, సందీప్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం

సూర్యాపేట అర్బన్, నేరేడుచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారం పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో దేవాలయ అర్చకుడు భట్టారం వంశీకృష్ణశర్మ ఆధ్వర్యంలో మంగళగౌరీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి బృందావనం తేజ ఆధ్వర్యంలో మొదట ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మంగళ గౌరీ వ్రతం అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, పులిజాల వెంకరమణారావు, పాల్గొన్నారు.

పక్షపాతంతో వ్యవహరిస్తున్న మోదీ సర్కార్

మేళ్లచెర్వు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై మోదీ సర్కార్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తెలంగాణకు రాజ్యాంగబద్ధంగా, చట్టపరంగా రావాల్సిన నిధులు, నియమకాల పట్ల మోదీ సర్కార్ పక్షపాతంగా వ్యవహరించడం సరికాదన్నారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ సకల జనులు ఉద్యమాలు, పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో భావన ఆదినారాయణ, సైదులు, నర్సింహారావు, శంకర్, నరేష్ పాల్గొన్నారు.

సదరన్ క్యాంపునకు 90 మంది హాజరు

భానుపురి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరన్ క్యాంపునకు పలువురు దివ్యాంగ బాధితులు బారులు తీరారు. పరీక్ష చేయించుకుని రావాలని కొంతమందిని వైద్యుల వద్దకు పంపారు. మరికొందరికి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన సదరన్ క్యాంపునకు 90మంది హాజరయ్యారని డీఆర్‌డీపీ ఏపీఎం జటంగి రవి తెలిపారు. బుధవారం కూడాసదరన్ క్యాంపును కొనసాగిస్తామన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

తిరుమలగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని హిందూ ధర్మపరిరక్షణ సమితి నాయకుడు వేణుమాధవ్ కోరారు. హిందూ సనాతన ధర్మ పరిక్షణ కోసం సదాశివపేట నుంచి చేరుకుంది. ఈ పాదయాత్రకు మునిసిపల్ కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి వెంకటేశ్వర్లు, రూపని వెంకన్న, రమేష్, శ్రీహరి, రాములు పాల్గొన్నారు

నూతన కమిటీ ఎన్నికపై విచారణ జరిపించాలి

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మికల్ దండుమైసమ్మ దేవాలయ కమిటీ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పడిందని, దీనిపై విచారణ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వీరబోయిన వెంకన్న అన్నారు. మంగళవారం మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ సభ్యుల అర్హత దరఖాస్తులను పరిశీలించాలన్నారు. చైర్మన్ పదవిని నెమ్మికల్‌కు ఇచ్చే అనవాయితీని పక్కన పెట్టి పక్క గ్రామానికి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి పదవులు ఇవ్వడం ఏకపక్ష నిర్ణయమని అన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో వై.మధు, జి.కర్ణాకర్, మల్లేష్, కృపాకర్, రాకేష్ పాల్గొన్నారు.

సంఘాల్లో సభ్యులను పెంచాలి

గరిడేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో సభ్యులను పెంచాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, బ్యాంక్ లింకేజి బెనర్జీ అన్నారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘంలోని వృద్ధ మహిళలను సంఘంలో చేర్పించాలని, 15నుంచి 18సంవత్సరాల వారితో కిశోర బాలిక సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం డి.అజయ్‌నాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు వీరకుమారి, గంగమ్మ, రజియాబేగం, *జ్యోతి, సీసీలు చిన్న, సుజాత పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

చివ్వెంల ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ యువజన సంఘం నాయకుడు భాషపంగు సునీల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నేటికి హామీలు నేరవేర్చలేదని మండిపడ్డారు. గాంధీభవన్ ముట్టడికి వెళుతున్న యువజన నాయకులను అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడం హేయమైన చర్యని అన్నారు. తక్షణమే నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, హరీశ్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం

కోదాడ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూత అందించడం అభినందనీయమని పీసీసీ ప్రతినిధి, కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడలోని బాలికల పాఠశాలలో, ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బీరువా అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జీవి అకాడమి సలహాదారుడు రామయ్య, ఇన్‌చార్జి పీఎస్ఆర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏబీఏపీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లా కేంద్రానికి చెందిన భూపతి శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీవీ పుల్లంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఆయనను ఎన్నుకున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

హుజూర్‌నగర్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని టీపీసీసీ కార్యదర్శి ఎండీ అజీజ్‌పాషా, మాజీ కౌన్సిలర్ అట్లూరి మంజుల కోరారు. మంగళవారం పట్టణంలో మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. నాటిన మొక్కలను ఎదిగే వరకు కాపాడాలన్నారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు, నాగేశ్వరరావు, శిరీష, విజయలక్ష్మి, బాలమ్మ, సీత పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలని సీఐ చరమందరాజు, ఎంపీడీవో లావణ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బీకే శైలజ ఆధ్వర్యంలో అధికారులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరినీ గౌరవించాలని, సోదరభావంతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి సంప్రోక్షణ శాంతి హోమం

కోదాడ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబండగూడెం గ్రామంలో మంగళవారం ముత్యాలమ్మతల్లి సంప్రోక్షణ శాంతిహోమాన్ని గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మతల్లి దేవాలయం వద్ద గ్రామ పురోహితులు రామయ్య బృందం ఆధ్వర్యంలో శాంతి హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శాంతి హోమాన్ని తిలకించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వున్నం కోటేశ్వరరావు, నల్లపాటి నర్సింహారావు, శరబేశ్వరరావు, ముండ్రా రంగారావు, ఏదులాపురం శ్రీనివాసరావు, ఆదినారాయణ, రమాసుందర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

మద్దిరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలుమళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎహెచ్ఎం జహీర్ సొంత ఖర్చులతో దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు సహకరించి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.